సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 17 । జనవరి । 2023



ఎంత పని చేశావు తల్లీ..!

కన్నతల్లే తన బిడ్డ ప్రాణం తీసిన హృదయ విదారక సంఘటన రాయచోటిలో చోటు చేసుకొంది. మానసిక స్థితి సరిగాలేక ఆమె ఈ ఘాతుకానికి పాల్పడింది - 8లో



ముస్లింల సంక్షేమానికి కృషి

ముస్లింల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. కనుమ సందర్భంగా ముస్లింలకు ఆయన విందు ఏర్పాటు చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31.3 /13.4

వాతావరణం

జిల్లాలో సోమవారం 13.4 – 31.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్



కడప అర్బన్ : దిశపోలీసు స్టేషన్‌లో పిండివంటను రుచి చూస్తున్న జిల్లా ఎస్పీ



కమలాపురం : చదిపిరాళ్లలో కుందేలును పట్టుకున్న యువత



ఎర్రగుంట్ల : పార్వేట ఉత్సవంలో ఆంజనేయ స్వామి రథం



రాజుపాళెం : టంగుటూరులో నృత్యం చేస్తున్న కళాకారులు

బద్వేలు అర్బన్ : విద్యానగర్‌లో గొబ్బెమ్మలను ఊరేగింపుగా తీసుకెళుతున్న మహిళలు



సంబరాల సంక్రాంతి... ఊరంతా కొత్త కాంతి

- ఉల్లాసంగా పల్లెలు, పట్టణాలు
- కోలాహలంగా కనుమ పండుగ
- అంతటా ఆనందోత్సాహాలు
- పెద్దలకు శాస్త్రోక్తంగా కర్మకాండలు
- ముగిసిన సంక్రాంతి ఉత్సవాలు

కడప కల్చరల్ : జిల్లాలో సంక్రాంతి పండుగను వైభవంగా నిర్వహించారు. భోగితో ప్రారంభమైన ఆనందోత్సాహాలు రెండు, మూడవ రోజైన సంక్రాంతి, కనుమల్లో కూడా వెల్లి విరిశాయి. పల్లెలు, పట్టణాల్లో ఇళ్లు బంధుమిత్రులతో కళకళలాడాయి. బయటి ప్రాంతాల్లో ఉద్యోగం చేసుకుంటూ పండుగ కోసం వచ్చిన వారితో ఇళ్లన్నీ సందడిగా మారాయి. పలుచోట్ల సోమవారం ఉదయాన్నే తలస్నానాలు చేసి పెద్దలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా దివంగతులైన కుటుంబ పెద్దలకు శాస్త్రోక్తంగా కర్మకాండలు జరిపించారు. ముఖ్యంగా కాలువలు, చెరువులు, నదీ తీరాలలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. పుష్పగిరి, కొండపేట, సిద్దవటం నదుల వద్ద చుట్టుపక్కల గ్రామాలతోపాటు కడప నగరం నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లి పెద్దలకు పిండ ప్రదానం నిర్వహించారు.

కోలాహలంగా కనుమ

పండుగ చివరినాడు కనుమను సంప్రదాయబద్ధంగా, కోలాహలంగా నిర్వహించారు. పలుచోట్ల స్థానికంగా రైతులు, గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు ఎడ్ల పందేలు, అల్లెంగుండు ఎత్తడం లాంటి గ్రామీణ పోటీలు నిర్వహించారు. ఇంకొన్నిచోట్ల బిర్రు బండ్లు, బండ్ల పందేలు ఏర్పాటు చేశారు. దాదాపు అన్ని మండలాల్లోనూ ఎక్కడో ఒకచోట స్థానిక పెద్దలు, యువకులు కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. ట్రాక్టర్ల రాకతో గ్రామాల్లో ఎద్దుల సంఖ్య తగ్గినా ఉన్నంతలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ కనుమ పండుగను పశువుల పండుగగా ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎడ్లు, పశువులను శుభ్రం చేసి పూజలు చేశారు. ముఖ్యంగా ఎడ్లను రంగురంగుల కుచ్చులు, గజ్జెల పట్టీలతో అలంకరించారు. స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో గ్రామాల్లో స్థానికంగా గ్రామీణ ఆటల పోటీలను నిర్వహించారు. పల్లెలతోపాటు పట్టణాలలో కూడా మైదానాల్లో పిల్లలు, పెద్దలు గాలిపటాలు ఎగురవేశారు. నగరంలో మిద్దెలపై నుంచి పిల్లలు పతంగుల ముచ్చట తీర్చుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కబడ్డీ, ఇతర గ్రామీణ క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రి దేవాలయాల సమీపంలో పార్వేట కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు.

అంతటా ఆనందం

పండుగల్లో ముఖ్యమైనదిగా, పెద్దదిగా భావించే సంక్రాంతిని ఈ సంవత్సరం కూడా జిల్లా వాసులు ఆనందంగా నిర్వహించుకున్నారు. పల్లెలతోపాటు పట్టణాలు, కడప నగరంలో కూడా పండుగ సందడి కనిపించింది. ముఖ్యంగా పల్లెల్లో బంధుమిత్రులతో ఇళ్లు కళకళలాడాయి. కుటుంబ సభ్యులతోపాటు ఇతర మతాలకు చెందిన సన్నిహితులు, మిత్రులను కూడా కనుమ నాడు విందు భోజనానికి ఆహ్వానించారు. రాత్రి వరకు పలు ముచ్చట్లతో ఆనందంగా గడిపారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే మాంసం దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ వినియోగం సగానికి పైగా తగ్గింది. దీంతో చికెన్ సెంటర్ల వద్ద జనం పలుచగా కనిపించారు. కొన్నిచోట్ల మహిళలు బంధుమిత్రులను ఇంటికి ఆహ్వానించి పేరంటాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.



నరహరిపురంలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



వీరపునాయునిపల్లె : ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



పులివెందుల టౌన్: శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పులివెందుల టౌన్ : శిల్పారామంలో సందర్శకులు

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు



వెదురూరులో జనసందోహం నడుమ బండలాగుతున్న ఎద్దులు

చాపాడు : సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం కనుమ పండుగను పురస్కరించుకుని చాపాడు మండలం నరహరిపురంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించారు. ప్రొద్దుటూరు మండలం చౌటపల్లె గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 2,202 అడుగులు లాగి ప్రథమ స్థానంలో, సింహాద్రిపురం మండలం చెర్లోపల్లెకు చెందిన నంద్యాల శివారెడ్డి ఎద్దులు, వల్లూరు మండలం వల్లూరుకు చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు 2,100 అడుగులు లాగి రెండు, మూడు స్థానాల్లో నిలవగా, అనంతపురం జిల్లా గోర్లదిన్నె గ్రామానికి చెందిన కె.రామాంజనేయులు ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.1,00,016, రూ.70,016, రూ.40,016, 20,016 బహుమతులు నిర్వాహకులు అందించారు.

వెదురూరు బండలాగుడు పోటీల్లో తెలంగాణ ఎద్దులకు ప్రథమ బహుమతి

చాపాడు మండలం వెదురూరు గ్రామంలో సోమవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సురేంద్రారెడ్డి ఎద్దులు 2,055 అడుగులతో ప్రథమ స్థానంలో, రాజుపాళెం మండలం వెలవలి గ్రామానికి చెందిన తంబుసాబ్ ఎద్దులు 2,003 అడుగులు లాగి ద్వితీయ స్థానం, వీరపునాయునిపల్లె మండలం కీర్తిపల్లెకు చెందిన చిట్టిబోయిన భరత్‌కుమార్ ఎద్దులు 15,085 అడుగులు లాగి మూడో స్థానంలో, ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్‌కు చెందిన సిద్దారెడ్డి నాగసుబ్బారెడ్డి ఎద్దులు 15,010 అడుగులతో నాలుగో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.1,00,116, రూ.70,116, రూ.40,116, 20,116 బహుమతులు నిర్వాహకులు అందించారు.

కనుల పండువగా మాధవరాయస్వామి పారువేట

మైదుకూరు : సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా కనుమ పండుగ రోజు సోమవారం మైదుకూరులో శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి పారువేట కార్యక్రమం కనుల పండువగా జరిగింది. విశేష అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీ మాధవరాయస్వామిని ప్రత్యేక పూల రథంపై ఆలయంలో నుంచి మేళతాళాలతో పారువేట నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. పారువేట కార్యక్రమంలో కోలాటం, చెక్కభజన, విచిత్ర వేషధారణలు, కోలాహలంగా మారాయి. కేరళ డ్రమ్ము ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎమ్మెల్యే పూజలు

పారువేట కార్యక్రమంలో శ్రీలక్ష్మీ మాధవరాయస్వామిని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుబ్బరాయుడు, కార్యనిర్వహణాధికారి ప్రసాద్ రావు తదితరులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు.



శ్రీదేవి, భూదేవి సమేతుడై పారువేటకు బయలుదేరిన మాధవరాయుడు



పారువేటలో పాల్గొన్న భక్తులు



ఆకట్టుకున్న మహిళల కోలాటం

విద్యుత్ ధరలపై అభ్యంతరాలు తెలపండి

కడప కార్పొరేషన్ : 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన ఆదాయ అవసరాలు, విద్యుత్ రిటైల్ ధరలపై వినియోగదారులు తమ అభిప్రాయాలను, అభ్యంతరాలను తెలపాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. మునిశంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి వారు ఈనెల 19, 20, 21 తేదీలలో విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారన్నారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు తమ అభ్యంతరాలను ఏపీఈఆర్‌సీ. జీవోవీ. ఇన్ వెబ్‌సైట్లో నమోదు చేయాలన్నారు. అలాగే కడప డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో ఉన్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయానికి వచ్చి వీడియో కాన్ఫరెన్స్‌లో తమ అభ్యంతరాలను తెలుపవచ్చన్నారు. రాజంపేట, రాయచోటి, పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు డివిజన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వారి కార్యాలయంలో నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చన్నారు.

షాక్ కొడుతుంది జాగ్రత్త!

- విద్యుత్ ప్రమాదాల నివారణపై ఏపీఎస్‌పీడీసీఎల్ ప్రత్యేక దృష్టి
- ఉద్యోగులు, వినియోగదారులు పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం
- సబ్ స్టేషన్ల వారీగా అవగాహనా సదస్సులు

నిత్య జీవితంలో విద్యుత్ ఎంత అత్యవసరమో అందరికీ తెలిసిందే. ఒక గంట కరెంట్ లేకపోతే మనకు ఊపిరాడదు.. ఇంట్లో, బయటా ఏ పనీ జరగదు. మనిషి జీవన విధానంలో ఇంతగా పెనవేసుకుపోయిన విద్యుత్ వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో, దాన్ని సక్రమంగా వినియోగించకపోతే అన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు కృషి చేస్తున్నా అక్కడక్కడా ఇంకా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఇందులో మానవ తప్పిదం వల్ల జరిగేవి కొన్నయితే..యాదృచ్ఛికంగా జరిగేవి మరికొన్ని.. వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలపై ప్రత్యేక కథనం.... – కడప కార్పొరేషన్

విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నియంత్రించేందుకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్‌పీడీసీఎల్) నడుం బిగించింది. సంస్థలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది, వినియోగదారులు పాటించాల్సిన భద్రతపై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని నిర్ణయించింది. సబ్ స్టేషన్ల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలు, రైతుల్లో చైతన్యం పెంచేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు వైఎస్సార్ జిల్లాను విద్యుత్ ప్రమాద రహిత జిల్లాగా మార్చేలా ప్రణాళిక రచించారు. వైఎస్సార్ జిల్లాలో 2022–23 సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ 41 విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. ఇందులో 26 మందికి నష్ట పరిహారం చెల్లించగా, 12 మందికి చెల్లించాల్సి ఉంది.

వినియోగదారులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇళ్లలో అంతర్గత వైరింగ్‌కు ఉపయోగించే విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు, ఇతర పరికరాలు ఐఎస్ఐ మార్కు కలిగినవి ఉపయోగించాలి.
- ఇంటిలోని స్విచ్ బోర్డులను తగినంత ఎత్తులో అమర్చుకోవాలి. రైతులు విద్యుత్ మోటార్ల స్విచ్‌లు(స్టార్టర్) ఆన్, ఆఫ్ చేసేటప్పుడు విధిగా కాళ్లకు, చేతులకు రబ్బరు తొడుగు ధరించాలి. బోర్డు పరిసర ప్రాంతాల్లో తేమ లేకుండా చూసుకోవాలి.
- విద్యుత్ సర్వీసు కోసం వినియోగించే సర్వీసు వైరు నాణ్యమైన, లోడ్‌కు అనుగుణంగా తగిన కెపాసిటీ వాడినట్లయితే విద్యుత్ సరఫరాలో అంతరాయాలను, ఓల్టేజ్ హెచ్చుతగ్గులను నివారించవచ్చు.
- ప్రతి ఇంటి విద్యుత్ సర్వీసుకు తప్పనిసరిగా ఎర్త్ పైపు ద్వారా ఎర్తింగ్‌ను ఏర్పాటు చేయాలి. పొలాల వద్ద అమర్చే స్టార్టర్లకు ఎర్తింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి.
- వర్షం కురుస్తున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు తాకరాదు. నీటిలో నిలబడి విద్యుత్ మోటార్లను, స్విచ్(స్టార్టర్లను తాకరాదు. తడిచేతులతో, తడి కాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లు ఆన్ ఆఫ్ చేయరాదు.
- ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నప్పుడు తక్కువ ఎత్తులో విద్యుత్ లైన్లు, స్తంభాలు ఉన్నట్లయితే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేసి విద్యుత్ సంస్థ ప్రామాణిక నిబంధనల ప్రకారం తగిన దూరం పాటించి నిర్మాణాలను చేపట్టాలి.
- బహిరంగ ప్రదేశాల రక్షణ, పంట పొలాలు జంతువుల బారిన పడకుండా కట్టెలపై విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం, ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా ఇవ్వడం చట్టరీత్యా నేరం. ఇలాంటి పనులు చేసిన వారు చట్టరీత్యా శిక్షార్హులు.
- కొబ్బరి, పామాయిల్ తదితర తోటలలో కొమ్మలు తొలగించేటప్పుడు విద్యుత్ శాఖ సిబ్బందికి గానీ, 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు గానీ ఫోన్ చేసి లైన్ క్లియర్ (ఎల్‌సీ)తీసుకోవాలి. తొందరపడి ప్రమాదాలకు గురికావద్దు.
- ఇళ్ల డాబాలపై బట్టలు ఆరవేసేటప్పుడు, ఇళ్ల నిర్మాణం జరుగుతున్నప్పుడు సమీపంలో విద్యుత్ లైన్లు ఉన్నట్లయితే విద్యుత్ నిబంధనల ప్రకారం తగినంత దూరం పాటించాలి.
- తోటలలో, పొలాల్లో, ఇతర ఏ ప్రదేశాలలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు తెగి పడి ఉంటే వాటిని నేరుగా తాకరాదు. వెంటనే విద్యుత్ సిబ్బందికిగానీ, 1912కు గాని తెలియజేయాలి.
- గ్రామాలలో కొంతమంది విద్యుత్‌ను కొక్కేల ద్వారా వైరు మధ్యలో తీసుకోవడం వల్ల అవి తెగి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. విద్యుత్ స్తంభం నుంచి మాత్రమే కనెక్షన్ తీసుకోవాలి.
- విద్యుత లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, ఫీజులు వేయడం వంటి పనులు సొంతంగా నిర్వహించకుండా విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేసి వారి ద్వారా మాత్రమే మరమ్మతులు చేయించుకోవాలి.
- వీధి దీపాలకు సంబంధించిన ఫేజ్ వైర్ల మరమ్మతులకు లైన్ క్లియర్ తీసుకున్న తర్వాతే పాడైన స్విచ్‌లు, బల్బులు మార్చడం వంటివి చేయాలి. ఈ పనులను అనుమతించిన సిబ్బంది తప్పా మరే ఇతర వ్యక్తులు చేయరాదు.



విద్యుత్ మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులు(ఫైల్)

- విద్యుత్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ శాఖ సిబ్బందినే సంప్రదించాలి తప్పా ప్రైవేటు వ్యక్తులను సంప్రదించకూడదు.
- ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనిస్తే ఆ వ్యక్తినిగానీ, విద్యుత్ పరికరాన్నిగానీ నేరుగా తాకరాదు. వెంటనే దగ్గరలోని విద్యుత్ అధికారికిగానీ, సిబ్బందికిగానీ తెలియజేయాలి.
- పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులు విద్యుత్ పరికరాలను మరమ్మతు చేసేటప్పుడు భద్రతా నియమాలు పాటించాలి.

విద్యుత్ సిబ్బంది తీసుకోవాల్సిన భద్రతా చర్యలు

కొందరు విద్యుత్ ఉద్యోగులు ఐదు నిమిషాల పనే కదా అని తాత్సారం చేసి సేఫ్టీ పరికరాలు వాడకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరిగి తమ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. అలా జరక్కుండా ఉండాలంటే విద్యుత్ సిబ్బంది విధులు నిర్వహించేటప్పుడు తమ వద్ద కచ్చితంగా ఇండక్షన్ టెస్టర్, ఎర్త్‌పైపు, రబ్బరు తొడుగులు, సేఫ్టీ బెల్టు కలిగి ఉండాలి. పనులు చేసేటప్పుడు విధిగా సంబంధిత లైన్ ఎర్తింగ్ చేసుకొని పనులు కొనసాగించాలి.

రైతుల్లో ఎక్కువ అవగాహన రావాల్సి ఉంది



అవగాహనా కార్యక్రమాలు అనేవి ఒకసారి నిర్వహించి ఆపేసేవి కావు. నిరంతరం విద్యుత్ ప్రమాదాలపై చైతన్య పరుస్తూ ఉండాలి. పోల్ నుంచి వైరు స్టార్టర్‌కు తీసుకుపోవడంలో ఎక్కడా జాయింట్లు ఉండకూడదు. కచ్చితంగా స్టార్టర్‌కు ఎర్తింగ్ చేసుకోవాలి. సర్వీసు వైర్లు నాణ్యమైనవి ఉపయోగించాలి. విద్యుత్ సిబ్బంది కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎల్‌సీ తీసుకొని కరెంటు లేదని నిర్ధారించుకున్న తర్వాతే పనులు చేయాలి.

– ఎస్. మునిశంకరయ్య, పర్యవేక్షక ఇంజినీరు, ఏపీఎస్‌పీడీసీఎల్(కడప సర్కిల్)

ఆర్వోబీ కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజంపేట : రాజంపేట ఆర్వోబీ కింద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. అతని వయసు 40 ఏళ్ల ఉండవచ్చని పేర్కొన్నారు. చిత్తు కాగితాలు ఏరుకుంటూ, మద్యం సేవిస్తూ ఆర్వోబీ స్పాన్ కింద జీవనం సాగించే వాడన్నారు. మృతదేహాన్ని ఏరియా హాస్పిటల్‌లో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసులో నిందితులు

రాయచోటి టౌన్ : గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకరరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం సాయంత్రం రాయచోటి - లక్కిరెడ్డిపల్లె రింగ్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న పవన్‌కుమార్ అలియాస్ కుండల పవన్‌కుమార్, శ్రీకాంత్ అలియాస్ లడ్డు అలియాస్ బ్లాస్ట్, న్యాజీ ఇమ్రాన్ బాషాను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 3.8 కిలోల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. వీరు మారుమూల ప్రాంతాలలో నుంచి తీసుకొచ్చి చిన్నమండెం మండలంలో అమ్మేవారని విచారణలో వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎంత పని చేశావు తల్లీ..!

- కన్న కూతురి ప్రాణం తీసిన అమ్మ
- గొంతు నులిమి.. హత్య చేసి..
- మానసిక స్థితి సరిగా లేక.. ఘాతుకానికి పాల్పడిన వైనం





తన కుమార్తెతో తండ్రి మహమ్మద్ బాషా (ఫైల్), మృతి చెందిన రుక్సానా

రాయచోటి టౌన్ : కడుపులో పెరుగుతున్నప్పటి నుంచే తల్లి ఎంతో అల్లారుముద్దుగా చూసుకుంటుంది. భూమి పైకి వచ్చిన తర్వాత కంటికి రెప్పలా కాపాడుతుంది. కట్టుకున్న భర్త పట్టించుకోకపోయినా.. నా అన్న వారు పలకరించకపోయినా.. చివరికి తాను ఏకాకై నా సరే సర్వం ధారపోసి బిడ్డలను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతుంది. అలాంటి అమ్మ తన కడుపున పుట్టిన బిడ్డను తన చేతులతోనే కర్కోటకంగా గొంతు నులిమి చంపిన సంఘటన రాయచోటిలో చోటుచేసుకుంది. ఈ ఘటన శనివారం రాయచోటి పట్టణ శివారులోని పెమ్మాడపల్లె గ్రామం పొలాల వద్ద ఉన్న నక్కలగుట్టలో జరిగింది. మానసిక స్థితి సరిగా లేకపోవడం, అనవసర భయంతో ఆమె ఈ దుర్ఘటనకు పాల్పడింది. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరులోని చెన్నారెడ్డి వీధికి చెందిన షేక్ మహమ్మద్ బాషా సంబేపల్లె మండలం చౌటపల్లె గ్రామం షేక్ ఫాతిమాను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి రుక్సానా (10 నెలల) కుమార్తె ఉంది. ఫాతిమా మానసిక స్థితి సరిగా లేదు. ఆమె భర్త ఇంటి నుంచి అప్పుడప్పుడూ చెప్పకుండా పుట్టింటికి వచ్చేది. తన ఆరోగ్యం సరిగా లేదని, త్వరగా చనిపోతానని భావించింది. తాను చనిపోతే తన బిడ్డను ఎవరు చూసుకుంటారు అనే అనుమాన పడింది. ఎవరూ చూసుకోరనే నిర్ణయానికి వచ్చింది. అనుకున్నదే తడువుగా శనివారం తన పసిబిడ్డను తీసుకొని రాయచోటికి వచ్చింది. అక్కడి నుంచి పుట్టింటికి వెళ్లేందుకు మనసు నచ్చక రాయచోటిలోనే ఆగిపోయింది. రాయచోటి పట్టణ శివారులోని పెమ్మాడపల్లె సమీపాన ముళ్ల పొదల వద్ద ఉన్న గుట్టల్లోకి తీసుకెళ్లి కుమార్తె గొంతు నులిమి చంపేసింది. కుమార్తె మృతదేహాన్ని తన భుజాలపై వేసుకొని రాయచోటికి వచ్చి, అక్కడి నుంచి తిరిగి పీలేరుకు వెళ్లింది. అప్పటికే రాత్రి కావడంతో పీలేరు నుంచి భర్త బంధువులకు ఫోన్ చేసి తన బిడ్డను చంపేశానని, వచ్చి తీసుకెళ్లాలని చెప్పింది. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా చిన్నారి విగతజీవిగా పడి ఉంది. బంధువులు పాప శవాన్ని తీసుకొని రాయచోటి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆదివారం నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్టీపీపీ ఉద్యోగికి గాయాలు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో జేపీఏగా పని చేస్తున్న శివరామయ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కలమల్ల ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగుంట్లకు చెందిన శివరామయ్య ఆర్టీపీపీలో జేపీఏగా పని చేస్తున్నాడు. ఆర్టీపీపీ నుంచి స్కూటర్‌లో ఇంటికి బయలు దేరాడు. సున్నపురాళ్లపల్లె గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఎటీఎంకు వెళ్లే సీఎంఎస్ వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన గాయపడ్డాడు. వెంటనే చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి..

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో టమాట రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. కలకడ మండలం కొవ్వూరివాండ్లపల్లెకు చెందిన రైతు చంద్రబాబునాయుడు (40) మదనపల్లె సమీపంలోని కర్ణాటక రాష్ట్రం రాయల్పాడులో టమాట పంట లీజుకు తీసుకున్నాడు. ఈ క్రమంలో పొలం వద్దకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా వేంపల్లె క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ముస్లింల సంక్షేమానికి నిరంతర కృషి

రాజంపేట : నియోజకవర్గంలోని ముస్లింల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం మేడా భవన్‌లో ముస్లింలకు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముస్లింలకు పెద్ద ఎత్తున ఆత్మీయ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లింలు, క్రైస్తవులకు మేడా కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని రాజంపేటలో వారికి కులపరంగా వున్న సమస్యలను పరిష్కరిస్తూ వచ్చామన్నారు. ఎమ్మెల్యే సోదరుడు ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి మాట్లాడుతూ తెలుగువారి పెద్దపండుగ సంక్రాంత్రి అని, ఆ రోజున ముస్లింలకు ఆత్మీయ విందు ఇవ్వడం ఆనవాయితీగా చేపడుతున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,500 మంది ముస్లింలకు ఆత్మీయ పలకరింపులతోపాటు విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం, క్రైస్తవ పెద్దలు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, సిద్దవటం ఇన్‌చార్జి మేడా మధుసూదనరెడ్డిలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఆర్‌ఐడీసీ స్టేట్ డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, ఫరూక్, షేక్ హైదర్‌బాషా, షేక్‌జాహిద్ అలీ, పఠాన్ ఖాజామోహిద్దీన్, మున్వర్‌బాష, సయ్యద్ అఫ్సర్, సుండుపల్లె జెడ్పీటీసీ ఇస్మాయిల్, సర్పంచి రఫీ, నందలూరు కో–ఆప్షన్ మెంబర్ కలీం, సిద్దవటం జవహర్‌బాష, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సమియా తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

- కుమారుడి దుర్మరణం
- తండ్రికి తీవ్ర గాయాలు



మృతి చెందిన షేక్ నసీర్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం రామకృష్ణ జూనియర్ కళాశాల– అంబా భవానీ గుడి మధ్య దారిలో వున్న బుగ్గవంక వంతెనపై డివైడర్‌ను మోటార్‌సైకిల్ ఢీకొనడంతో కుమారుడు షేక్ నసీర్ (27) దుర్మరణం చెందాడు. ఈ ప్రమాదంలో అతని తండ్రి మహమ్మద్ హుసేన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన వివరాలను సీఐ ఉలసయ్య తెలియజేశారు. కడప నగరం అశోక్‌నగర్‌కు చెందిన వీరు మోటార్ సైకిల్‌పై బిల్టప్ వరకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తండ్రి ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

ఢీకొన్న లారీ, కార్లు

8 మందికి గాయాలు



బాధితులను 108లో తరలిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చెర్లోపల్లి సమీపాన ఉన్న జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున లారీ, రెండు కార్లు ఢీకొనడంతో 8 మందికి గాయాలు అయ్యాయి. ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నై వైపు బొగ్గు లారీ వెళ్తోంది. పులివెందులకు రెండు కార్లు వెళ్తున్నాయి. ఎదురెదురుగా వస్తున్న లారీ, రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులలో వెళ్తున్న కులాయప్ప(30), శ్రీనివాసులు(50), ధనలక్ష్మి(46), విజయకుమారి(24), శ్రీవాని(24), గాయత్రి(27), రమణమ్మ(48), పండు (50) గాయాల పాలయ్యారు. వారిలో శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సమాజ సంక్షేమం కాంక్షించే కవిత్వం కావాలి

జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య



రచయితలను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : నేటితరం రచయితలు సమాజ సంక్షేమాన్ని కోరే కవిత్వం వెలువరించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య కోరారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక గ్రాండ్ ఇన్ హోటల్‌లో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, పోతుల చిన్న ఓబుల్‌రెడ్డి, కంచమ్మ, సరస్వతమ్మ స్మారక ట్రస్టులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ బ్రహ్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సామాజిక రుగ్మతలు రూపుమాపేలా, అభ్యుదయ భావనలు గల రచనలు రావాల్సిన అవసరం ఉందని, సంక్రాంతి సంప్రదాయాల వెనుక సామాజిక కోణం ఉందని ఆయన వివరించారు.

ఏ సాహిత్య ప్రక్రియ అయినా సగటు మనిషి సంతోషానికి మూలం కావాలని కోరారు. సభాధ్యక్షుడు, లయన్స్‌క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మానస చిన్నపరెడ్డి మాట్లాడుతూ నానాటికీ అడుగంటిపోతున్న భారతీయ సంప్రదాయాల పరిరక్షణకు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, వి.గౌరీశంకర్, సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సంప్రదాయాల్లో భాగంగా టూరిజం సంస్థ కవి సమ్మేళనం నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. సీనియర్ కథకులు పాలగిరి విశ్వప్రసాద్ మాట్లాడుతూ ఏ పండుగైనా మానవుని జీవన గతిని ఉన్నతీకరించడమే లక్ష్యంగా సాగాలన్నారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనంలో డాక్టర్ జీవీ సాయిప్రసాద్, యువ రచయిత షేక్ షబ్బీర్ హుసేన్, డాక్టర్ అనుగూరు చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, ఎస్ఎండిబాషా, సాక్షాత్కారం కేవీ రమణారెడ్డి, లయన్ కల్లూరు బాలయల్లారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, పంతుల పవన్‌కుమార్ తదితరులు కవితలు వినిపించారు. టూరిజం ఫొటోగ్రాఫర్ గంగుల యల్లేశ్వరరావు, గొబ్బూరి కోటేశ్వరరావు, సంస్థ కోశాధికారి బాలగొండ గంగాధర్, లయన్ బి.కొండారెడ్డి పర్యవేక్షణలో నిర్వాహకులు కవులను సంప్రదాయంగా సత్కరించారు. నిర్వహణ కమిటీ సభ్యులు కొండూరు కృష్ణంరాజు, చిల్లూరి రెడ్డెయ్యరాజు, మురళిరాజు, పిడుగు అంకిరెడ్డి, టూరిజం ట్రావెల్స్ అధినేత సయ్యద్, నెమలిదిన్నె నాగవేణి, గంగాధర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేకాట కేసులో టీడీపీ నేత అరెస్ట్

రాజంపేట : పట్టణ శివారులోని ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ఏర్పాటు చేసుకున్న గదిలో కొన్ని రోజులుగా రియల్ ఎస్టేట్ వ్యాపారి గంపశివ అనే టీడీపీ నాయకుని కనుసన్నల్లో పేకాట ఆడుతున్నట్లు పోలీసు శాఖకు సమాచారం అందింది. పట్టణ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గంపశివతోపాటు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.21,820 స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా పీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు



ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

చిన్నమండెం : మండల పరిధి చిన్నర్సుపల్లె పంచాయతీ మఠంలోని శ్రీ పీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. మఠం పీఠాధిపతి నాగలింగమయ్యస్వామి ఆధ్వర్యంలో రెండు రోజులుగా పీరయ్యస్వామి సమాధి వద్ద వారి కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం పీరయ్యస్వామికి అభిషేకాలు, సమాధి అలంకరణ కార్యక్రమాలతోపాటు రాత్రి అఖండ భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాత్రి బద్వేలు నటరాజనాట్యమండలి వారిచే శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర నాటకాన్ని ప్రదర్శించారు. ఆదివారం ఉదయం మౌలాలి జెండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉదయం నుంచి నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా కోదండ రాముని పార్వేట ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



పార్వేట మండపం వద్ద సీతారామలక్ష్మణులకు హారతి ఇస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఏకశిలానగరి ఒంటిమిట్టలో సోమవారం సాయంత్రం పరంధాముడి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కనుమ పండుగను పురస్కరించుకొని టీటీడీ ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోవెలలో శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు శ్రావన్ కుమార్, పవన్ కుమార్ ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం బాజాభజంత్రీల నడుమ ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం జరిపారు. ఈ సందర్భంగా చెరువు వద్ద ఉన్న మండపంలో మూలవిరాట్‌ను ఉంచి కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. అలాగే సమీప నాగేటి తిప్పపై టీటీడీ వారు రూ.45 లక్షలతో నూతనంగా నిర్మించిన సులువైన మార్గంలో ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి పరంధాముడి పార్వేట ఉత్సవాన్ని ఆలయ సంప్రదాయల పరంగా నిర్వహించారు. అనంతరం మాడవీధుల్లో వైభవంగా స్వామి ఊరేగింపు జరిగింది. భక్తులు గ్రామోత్సవంలో తమకు దర్శనమిస్తున్న స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు.

పురాతన ఆచారం.. మూగజీవాల వివాహం

వైభవంగా గొర్రె, పొట్టేలు పెళ్లి



గొర్రెలకు పెళ్లి జరిపిస్తున్న కురవపల్లె గ్రామస్తులు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయితీ కురవపల్లెలో ఆదివారం రాత్రి గొర్రె, పొట్టేలు పెళ్లి అంగరంగ వైభవంగా నిర్వహించారు. కురవపల్లెలో పురాతన కాలం నుంచి సంక్రాంతి సందర్భంగా మూగజీవాలకు వివాహం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఆదివారం గ్రామంలో గొర్రె, పోట్టేలు వివాహం జరిగింది. హిందూ సాంప్రదాయ పద్ధతిలో జరిగే వివాహం తరహాలో గొర్రె, పొట్టేలకు వివాహం జరిపించారు. పెళ్లి కుమార్తె, పెళ్లికుమారుడు వలె గొర్రె, పొట్టేలుకు ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని గొర్రెలు అన్నీ ఒక చోటకు తోలి అక్కడ దొడ్డిగంగమ్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రమిదలలో దీపం వెలిగించి గౌరమ్మ వారికి పూజలు జరిపారు. సాంప్రదాయ బద్ధంగా వక్కాకు శాస్త్రం చేయడం, సారె తీసుకెళ్లడం విశేషం. ఈ సందర్భంగా పిల్లనగ్రోవి, చెక్కభజనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గొర్రె, పొట్టేలు పెళ్లి అనంతరం నెల రోజులకు తిరిగి శివపార్వతులకు విశేష పూజలు (పెద్ద పండుగ) నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

సమాజం సుభిక్షమే లక్ష్యంగా..

సమాజం సుభిక్షమే లక్ష్యంగా పురాతన కాలం నుంచి కురవపల్లెలో గొర్రె, పొట్టేలుకు పెళ్లిచేయడం ఆచారంగా వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలా చేయడం ద్వారా పంట పొలాలను చీడపీడల నుంచి గౌరమ్మ అమ్మవారు కాపాడతారని విశ్వసిస్తున్నారు. అలాగే కురవ కులస్తులు ఎక్కువగా గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తున్నారని, జీవాలకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ప్రతి ఏటా ఈ పండుగ నిర్వహిస్తున్నామని చెబుతున్నారు.

పెద్దల కాలం నుంచి వస్తోంది



మా తాతల కాలం నుంచి గొర్రె, పొట్టేలుకు పెళ్లి చేయడం ఆచారంగా వస్తోంది. వారి ఆచారాన్ని మేము కొనసాగిస్తున్నాం. మా గ్రామానికి మంచి జరగాలని, మూగ జీవాలను కాపాడాలని గౌరమ్మ పూజలు చేయడం ఆనవాయితీ. ఈ ఆచారంతో అంతా మంచే జరుగుతోంది.

\- కంబళ్ల రెడ్డెప్ప, గౌడు, కురవపల్లె

పుణ్యఫలంగా భావిస్తున్నాం



మా పెద్దల కాలం నుంచి వస్తున్న ఆచారాన్ని మేము మా చేతుల మీదుగా జరిపిస్తుండడం పుణ్యఫలంగా భావిస్తున్నాం. గొర్రె, పొట్టేలుకు వివాహం చేయడం మా గ్రామంలో పెద్ద పండుగ. గౌరమ్మ అనుగ్రహంతో ఈ ఆచారాన్ని ప్రతి ఏటా సాంప్రదాయ పద్ధతిలో కొనసాగిస్తున్నాం.

\- చామంచుల శ్రీరాములు, పినపెద్ద, కురవపల్లె